ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

Bullet
Edition

ఆదివారం, 14 జూలై 2024
www.prajaaswaramdaily.com
12 PM

# ఏపీ మాజీ మంత్రిపై కేసు నమోదు!

## చంద్రబాబుపై సీదిరి అప్పలరాజు అనుచిత వ్యాఖ్యలపై ఫిర్యాదు



అమరావతి, జూలై 12 (ప్రజాస్వరం): రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరడంతో వైసీపీ మాజీ మంత్రులు, ఎమ్మెల్యేల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. వైసీపీ అధికారంలో ఉన్న నాడు చంద్రబాబుపై కొంతమంది నేతలు అసెంబ్లీ వేదికగా బూతులు మాట్లాడారు. ఆయన సతీమణి భువనేశ్వరి వ్యక్తిత్వాన్ని కించపరిచేలా రాష్ట్ర ప్రజలు అందరూ చూస్తుండగా వైసీపీ నేతలు వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం అప్పట్లో సంచలనంగా మారింది. అయితే, ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైసీపీ చిత్తుగా ఓడటంతో సీన్ ఒక్కసారిగా మారింది. ఈ క్రమంలోనే గతంలో చంద్రబాబు మానసిక పరిస్థితి బాగోలేదని, ఆ విషయాన్ని వైద్యుడిగా తాను ధృవీకరిస్తానంటూ కామెంట్ చేశారు. అయితే, ఆ వ్యాఖ్యలపై ప్రస్తుతం టీడీపీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. శ్రీకాకుళం జిల్లాలోని కాశీబుగ్గ పోలీసు స్టేషన్ లో ఎమ్మెల్యే గౌతు శిరీష, టీడీపీ నేతలు.. మాజీ మంత్రి అప్పలరాజుపై ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు అప్పలరాజుపై కేసు నమోదు చేయనున్నారు.



# ట్రంప్‌పై కాల్పులు

## ఉలిక్కి పడిన అగ్రరాజ్యం

### అమెరికా మాజీ అధ్యక్షుడిపై హత్యాయత్నం

### చెవికి గాయం.. తప్పిన ప్రాణాపాయం

### ఖండించిన ప్రెసిడెంట్ బైడెన్, అన్ని పార్టీల నేతలు

### ప్రజాస్వామ్యంలో హింసకు చోటులేదు : భారత ప్రధాని

వెబ్ డెస్క్, (ప్రజాస్వరం): అగ్రరాజ్యం అమెరికా ఉలిక్కిపడే ఘటన జరిగింది. ఆ దేశ మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి అయిన డొనాల్డ్ ట్రంప్‌పై దుండగులు కాల్పులకు పాల్పడ్డాడు. పెన్సిల్వేనియాలోని బట్లర్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో ప్రసంగిస్తుండగా ఈ దుశ్చర్యకు పాల్పడ్డారు. ట్రంప్‌నకు చెవి దగ్గర తీవ్రమైన గాయమైంది. తీవ్ర రక్తస్రావమయింది. బుల్లెట్ తగిలిన విషయాన్ని గుర్తించిన వెంటనే ట్రంప్ తాను ఉన్న ప్రదేశంలో కిందకు వంగారు. అప్రతమత్తమైన భద్రతా సిబ్బంది, సీక్రెట్ సర్వీస్ ఏజెంట్స్ తక్షణమే ఆయనను అక్కడి నుంచి రక్షించి హాస్పిటల్‌కు తరలించారు. ప్రస్తుతం ఆయన చికిత్స పొందుతున్నారు. కాగా ఈ ఘటనలో ఇద్దరు వ్యక్తులు మృత్యువాతపడ్డారు.

### గందరగోళం

అనూహ్య రీతిలో జరిగిన కాల్పుల ఘటనతో ఎన్నికల ర్యాలీలో ఒక్కసారిగా అరుపులు, కేకలతో గందరగోళం నెలకొంది. బుల్లెట్ గాయాల పాలైన ట్రంప్ చెవి, ముఖంపై రక్తం కనిపించాయి. ఒక చేతితో చెవిని పట్టుకున్నారు. కాగా ట్రంప్‌ను హాస్పిటల్‌కు తరలిస్తున్న సమయంలో ఆయన పిడికిలి బిగించి ఎన్నికల ర్యాలీలోని ప్రజలకు చూపించారు. కాగా మాజీ అధ్యక్షుడు ట్రంప్ సురక్షితంగా ఉన్నారంటూ సీక్రెట్ సర్వీస్ 'ఎక్స్' వేదికగా నిర్ధారించింది. ఆయన బాగానే ఉన్నారని, వైద్యులు ఆయనను పరిశీలిస్తున్నారని తెలియజేశారు.

అనుమానితుడు మృతి!

ట్రంప్‌పై కాల్పులకు తెగబడిన అనుమానాస్పద షూటర్ మృతి చెందినట్లు భావిస్తున్నారు. ఈ మేరకు అమెరికా మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. షూటర్‌తో పాటు పక్కనే ఉన్న మరో వ్యక్తి కూడా చనిపోయారని బట్లర్ కౌంటీ డిస్ట్రిక్ట్ అటార్నీ రిచర్డ్ గోల్డింగర్ చెప్పినట్టుగా 'వాషింగ్టన్ పోస్ట్' కథనం పేర్కొంది.

## పక్కా ప్లాన్..!

వెబ్ డెస్క్, (ప్రజాస్వరం): అమెరికా మాజీ అధ్యక్షుడు ట్రంప్‌పై ముందస్తు ప్లానింగ్ ప్రకారమే దాడి జరిగినట్లు అంచనా వేస్తున్నారు. సభా స్థలానికి ట్రంప్ వచ్చే సమయానికే నిందితుడు ఎదురుగా ఉన్న పైకప్పు ఎక్కి సిద్ధంగా ఉన్నట్లు గుర్తించారు. ముష్కరుడు ఆ ఇంటిపైకి ఎక్కేందుకు నిచ్చెన ఉంది. ఈ దాడికి పాల్పడిన నిందితుడి వయసు సుమారు 20 ఏళ్లని, స్థానికుడిగానే గుర్తించినట్లు ప్రచారం జరుగుతోంది. దర్యాప్తు సంస్థలు నిందితుడి పేరును మాత్రం వెల్లడించలేదు. నిందితుడు ఏఆర్ శ్రేణి సెమీ ఆటోమేటిక్ రైఫిల్‌తో ట్రంప్‌పై కాల్పులు జరిపాడు. ఆయుధాన్ని కూడా భద్రతా దళాలు స్వాధీనం చేసుకొన్నాయి. ట్రంప్‌పై కాల్పుల ఘటనను హత్యాయత్నంగానే దర్యాప్తు చేపట్టారు. ఈ విషయాన్ని ఎఫ్‌బీఐ అధికారికంగా ప్రకటించింది. ట్రంప్‌పై దాడి జరగవచ్చనే అనుమానంతోనే ఆయన సీక్రెట్ సర్వీస్ భద్రతను కొన్నాళ్ల క్రితమే మరింత కట్టుదిట్టం చేశారు.



## ఖండించిన అమెరికా రాజకీయ నేతలు

అమెరికా అధ్యక్ష ఎన్నికల బరిలో నిలిచిన డోనాల్డ్ ట్రంప్ పై కాల్పుల ఘటనను దేశాధ్యక్షుడు జో బైడెన్ తీవ్రంగా ఖండించారు. తమ దేశంలో హింసకు తావులేదని అభిప్రాయపడ్డారు. ఈ ఘటనపై పార్టీలకు అతీతంగా నేతలు ముక్తకంఠంతో ఖండించారు. ఘటనపై స్పందించిన బైడెన్ ఇలాంటి రాజకీయ హింసను ముందెన్నడూ చూడలేదన్నారు. ఇది అస్సలు తగదని, అందరూ దీన్ని ముక్తకంఠంతో ఖండించాలని పిలుపునిచ్చారు. త్వరలో ట్రంప్ తో మాట్లాడతానని ఎక్స్ వేదికగా వెల్లడించారు. ట్రంప్, ఆయన కుటుంబం కోసం ఆ దేవుడిని ప్రార్థిస్తున్నానని ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ పేర్కొన్నారు. ఈ అర్థరహిత కాల్పుల ఘటనకు తీవ్రంగా ప్రభావితమైనట్టు కామెంట్ చేశారు.

దేశంలో రాజకీయ హింసకు ఎటువంటి తావు లేదని మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా అన్నారు. అసలేం జరిగిందనేది ఇంకా తెలియరాలేదని, అయితే, ట్రంప్ క్షేమంగా ఉన్నందుకు మనందరం సంతోషించాలని పేర్కొన్నారు. రాజకీయాల్లో పరస్పర గౌరవం, సంస్కారపూరిత వాతావరణం నెలకొల్పేందుకు మనందరం పునరంకితమవ్వాలని పిలుపునిచ్చారు. ఇదో పిరికపంద చర్య అని మాజీ అధ్యక్షుడు జార్జ్ డబ్ల్యూ బుష్ వ్యాఖ్యానించారు.

సెనెట్ లో డెమాక్రటిక్ పార్టీ నేత చక్ షూమర్ కూడా ఘటనపై స్పందించారు. ట్రంప్ పై దాడి గురించి తెలిసి భయోత్పాతానికి లోనైనట్టు చెప్పారు. ఆయన క్షేమంగా ఉన్నారని తెలిసి ఊపిరిపీల్చుకున్నట్టు చెప్పారు. ట్రంప్ క్షేమంగా ఉన్నందుకు అమెరికన్లందరు దేవుడికి రుణపడి ఉన్నారని రిపబ్లికన్ నేత మిచ్ మెక్కానల్ పేర్కొన్నారు. ట్రంప్ క్షేమంగా ఉన్నందుకు ఆ దేవుడికి ధన్యవాదాలు చెబుతున్నానని హౌస్ మాజీ స్పీకర్ నాన్సీ పెలోసీ వ్యాఖ్యానించారు.



## రోడ్డెక్కిన నిరుద్యోగులు

### సీఎం రేవంత్ వ్యాఖ్యలతో రగడ

### అశోక్ నగర్, దిల్‌సుఖ్‌నగర్‌లో ఆందోళన

### భారీగా ట్రాఫిక్ జామ్, తీవ్ర ఉద్రిక్తత

### తెల్లవారుజామున అరెస్ట్

హైదరాబాద్, జూలై 13 (ప్రజాస్వరం): డీఎస్సీ రద్దు చేయాలని, గ్రూప్ 2 రద్దు చేసి, గ్రూప్ 2, 3 పోస్టులు పెంచాలని డిమాండ్ చేస్తూ ఆశోక్ నగర్లో నిరుద్యోగులు ఆందోళనకు దిగారు. రాత్రంతా ఆందోళన చేస్తూనే ఉన్నారు. ఆందోళన చేస్తున్న వారిపై సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలపై భగ్గుమన్నారు. ఈ సందర్భంగా గ్రూప్ 2, 3 పోస్టులు పెంచుతామని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, గత ప్రభుత్వం ఇచ్చినన్ని పోస్టులే ఇస్తే మిమ్మల్ని ఓటు ఓటు వేసి గెలిపించింది ఎందుకని ప్రశ్నిస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డికి అసలు పరీక్షల మీద అవగాహన ఉందా, గ్రూప్ 2, డీఎస్సీ సిలబస్ మీద అవగాహన ఉందా అని విరుచుకుపడ్డారు. బల్మూరి వెంకట్ 2023లో తమ దగ్గరికి వచ్చి మీకు ఉద్యోగాలు రావాలంటే బీఆర్ఎస్ ని ఓడ గొట్టాలని మమ్మల్ని పిలిచాడని.. ఇప్పుడు ఏ సందులో దాచుకున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ఏ పార్టీతోనూ సంబంధం లేదని చెప్పారు. దిల్‌సుఖ్ నగర్ లోనూ నిరుద్యోగులు ఆందోళనకు దిగారు. ఇలా ఉండగా తెల్లవారుజామున ఆందోళన చేస్తున్న వారిని పోలీసులు అదులపులోకి తీసుకున్నారు. మరోవైపు ఉదయం నుంచి ఓయూ హాస్టళ్లలో నిరుద్యోగులను పోలీసులు అరెస్ట్ చేస్తున్నారు.




## చెన్నైలో ఎన్‌కౌంటర్

చెన్నై, జూలై 13 (ప్రజాస్వరం): తమిళనాడు బీఎస్పీ చీఫ్ ఆర్మ్ స్ట్రాంగ్ హత్య కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఆర్మ్ స్ట్రాంగ్ మర్డర్ కేసులో కీలక నిందితుడైన రౌడీ షీటర్ తిరువేంగరం పోలీసుల ఎన్ కౌంటర్‌లో హతమయ్యాడు. కస్టడీ నుండి తప్పించుకుని పారిపోతుండగా పోలీసులు జరిపిన కాల్పుల్లో నిందితుడు మరణించాడు. కాగా, బీఎస్పీ స్టేట్ చీఫ్ ఆర్మ్‌స్ట్రాంగ్ మర్డర్ తమిళనాడులో తీవ్ర కలకలం రేపిన విషయం తెలిసిందే. ఈ కేసును తమిళనాడు ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. ఈ క్రమంలోనే పోలీసులు నిందితులను గంటల వ్యవధిలోనే అరెస్ట్ చేశారు. కీలక నిందితుడైన రౌడీ షీటర్ తిరువేంగరం పోలీసుల కస్టడీ నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించే క్రమంలో పోలీసుల కాల్పుల్లో మృతి చెందినట్లు ప్రకటించారు.

## రాజకీయాల్లో హింసకు చోటులేదు : మోదీ

అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పై కాల్పుల ఘటనపై భారత ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. తన స్నేహితుడు, అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పై జరిగిన దాడి పట్ల తీవ్ర ఆందోళన చెందానని అన్నారు. ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నానని అన్నారు. రాజకీయాల్లో, ప్రజాస్వామ్యంలో ఇలాంటి హింసకు చోటులేదని వ్యాఖ్యానించారు. ట్రంప్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నానని పేర్కొన్నారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్టు చెప్పారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఆయన స్పందించారు.

## దేశానికి మా తండ్రి లాంటి హీరో కావాలి



ట్రంప్ పై కాల్పుల విషయం తెలిసి ఆయన సంతానం కూడా తల్లడిల్లిపోయింది. అమెరికాకు ఇలాంటి ఫైటర్ కావాలి అంటూ ఎరిక్ ట్రంప్ వ్యాఖ్యానించారు. చెంపపై రక్తం కారుతుండగా పిడికిలి బిగించి గర్జిస్తున్న ట్రంప్ ఫొటోను ఆయన షేర్ చేశారు. తండ్రి ప్రాణాలు కాపాడేందుకు వేగంగా స్పందించిన సీక్రెట్ సర్వీసు అధికారులు ఇవాంకా ట్రంప్ ధన్యవాదాలు తెలిపింది. ఈ ఘటన తరువాత తన పూర్తి మద్దతు ట్రంప్ కేనని ప్రముఖ టెక ఆంత్రప్రెన్యూర్ ఎలాన్ మస్క్ పేర్కొన్నారు.

## నేడే తెరుచుకోనున్న జగన్నాథుడి రత్నభాండాగారం

ఒడిశా, జూలై 13 (ప్రజాస్వరం): ఒడిశాలోని పూరీ జగన్నాథుడి రత్న భాండాగారాన్ని అధికారులు నేడు తెరవనున్నారు. ఈ మేరకు జస్టిస్ బిశ్వనాథ్ రథ్ అధ్యక్షతన 16 మందితో ఏర్పాటు చేసిన కమిటీ నిర్ణయం తీసుకుంది. శ్రీక్షేత్రంలో జగన్నాథుడికి నిత్యం 119 మూలికా సేవలు జరుగుతాయి. వీటిని నిర్ణీత వేళల్లో సేవాయత్ లు చేపడతారు. ప్రస్తుతం పూరీలో రథయాత్ర జరుగుతోంది. 19వ తేదీ వరకూ జగన్నాథ, బలభద్ర, సుభద్రలు ఆలయం వెలుపల ఉంటారు. ఈ నేపథ్యంలో అధికారులు చేపట్టనున్న లెక్కింపునకు ఎన్ని రోజులు పడుతుంది? ఎవరు పాల్గొంటారు? భాండాగారం మరమ్మతులు, లెక్కింపు ఒకేసారి జరగనుందా? తదితర వివరాలు వెల్లడవ్వలేదు. భాండాగారం తలుపులు తెరవడానికి ఎంతమంది వెళతారన్న దానిపై కూడా స్పష్టత లేదు. ఈ ప్రక్రియ అంతా పూర్తి చేయడానికి మార్గదర్శకాలు జారీ కానున్నాయి. ఈసారి వివరాల నమోదును డిజిటైజేషన్ చేయిస్తామని ఒడిశా న్యాయశాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ పేర్కొన్నారు.

